క్లుప్తంగా

అదనపు జిల్లా కోర్టు మరమ్మతులకు అనుమతి

ఎమ్మెల్యే ఆర్కే చొరవపై బార్ అసోసియేషన్ హర్షం

మంగళగిరి: స్థానిక కోర్టుల ప్రాంగణంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటులో భాగంగా భవన మరమ్మతులు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ నిధులతో చేపట్టేందుకు హైకోర్టు గురువారం అనుమతి మంజూరు చేసింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రత్యేక చొరవతో ఇటీవల మంగళగిరికి అదనపు జిల్లా కోర్టు మంజూరైన విషయం విదితమే. అదనపు జిల్లా కోర్టుకు ప్రత్యేక చొరవతో కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఆర్కేకు మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, తోట నరసింహారావు, ఉపాధ్యక్షుడు జొన్నాదుల లెనిన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ఫిరంగిపురం: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వికేంద్రీకృత గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రామ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు కృషిచేయాలని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ దాసరి అనూరాధ, ఈవోపీఆర్డీ ఎం.నిర్మలాలక్ష్మీకుమారి, ఐటీసీ ఫినిష్ సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ ఉమామహేశ్వరి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఘన నివాళి

తాడేపల్లిరూరల్: సర్దార్ భగత్‌సింగ్‌కు పలువురు నివాళులర్పించారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సుందరయ్య గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు బి.చిరంజీవి, వి.సాంబశివరావు, జి.యోహాను, డి.బాలరాజు, నరేంద్ర, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

36 మంది విద్యార్థుల ఎంపిక

మంగళగిరి: నగర పరిధిలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఆరు నెలల ఇంటర్నషిప్ కోర్సు కోసం నెల్లూరు శ్రీ సిటీ ఆవరణలో గల ఇసూజీ మోటార్స్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 36 మంది విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల సెక్రటరీ వెనిగళ్ల వెంకట తాతారావు తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కె రామకృష్ణ, కె వేళాంగిణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సకాలంలో సరఫరా చేయాలి

మంగళగిరి: రేషన్ దుకాణాలకు సరుకు సకాలంలో అందేలా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ కేబీఎస్ ప్రగతి తెలిపారు. నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో గల ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. గోదాములోని బియ్యం, పంచదార, కందిపప్పు నిల్వ వివరాలను ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జి అజీజ్‌ను అడిగి తెలుసుకున్నారు. గోదాములో వర్షపునీరు కారి బియ్యం తడుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి బియ్యం తడవకుండా పక్క గోదాముకు మార్చాలని సూచించారు.

బాలిక అదృశ్యం

మేడికొండూరు: బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన బాలిక ఈనెల 22వ తేదీన కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో తనకు గుండెలో నొప్పిగా ఉందని తోటి కూలీలకు చెప్పి ఇంటికి వెళ్లింది. బాలిక ఇంటికి వెళ్లలేదు. ఆచూకీ కోసం వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాలిక తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళనలో మిర్చి రైతులు

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మిర్చి రైతుల గుండెల్లో గుబులు ప్రారంభమైంది. మండలంలోని గరికపాడు, దామరపల్లి, రావెల, పాములపాడు, దామరపల్లి, పొన్నెకల్లు, ఫణిదరం గ్రామాల్లో ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు రెండో కోత పంటను కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ ఏడాది మిర్చికి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు కోటి ఆశలతో సాగు చేపట్టి ఆనందంతో ఉన్నారు. నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆందోళన చెందుతున్నారు.

హామీలను అమలు చేసిన సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- గరికపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



గరికపాడు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

గరికపాడు(తాడికొండ): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించిన జగనన్న పాలనకు ప్రజలు మంత్రముగ్ధులై 2024 ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం గరికపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధితోనే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని నమ్మిన జగనన్న సచివాలయ వ్యవస్థను ప్రజలకు చేరువ చేసి గ్రామ స్థాయిలోనే అన్ని వ్యవస్థలను చేరువ చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాడన్నారు. ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండటంతో ఓర్వలేని ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలతో లబ్ధిపొందాలని చూస్తుందని, ప్రజలు ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించిన కత్తెర సురేష్‌కుమార్‌కు గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రతి ఒక్కరి సమస్యను సానుకూలంగా విన్న ఆయన అధికారులను పిలిచి సమస్యలను తక్షణ పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోకా వెంకయ్య, మాజీ అధ్యక్షుడు గద్దం మురారి, పులిపాటి మోహన్‌రెడ్డి, వేల్పూరి పవన్, వివిధ విభాగాల నాయకులు, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, అవుతు శ్రీనివాసరెడ్డి, తాళ్ల శివ నాగరాజు, దాసరి రాజు, బెజ్జం మహేష్‌బాబు, తాళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు పంపు ఏర్పాటు

తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ తగు చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆయన గురువారం తన సొంత నిధులు వెచ్చించి బోరు వేయించే పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పనులను కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31నాటికి పనులు పూర్తి చేయాలి



ప్రాతూరులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని 14, 15 ఆర్థిక సంఘం నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులను ఈనెల 31 నాటికి పూర్తి చేయాలని కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో కోటి రూపాయల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రాతూరు, ఉండవల్లి, కుంచనపల్లి, పెనుమాక, ఆత్మకూరు, నవులూరు, బేతపూడి తదితర ప్రాంతాల్లో 14, 15 ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆ పనులన్నీ కూడా ఈనెల 31 నాటికి పూర్తిచేసే విధంగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పూర్తిచేయాలని ఆదేశించామని, ప్రతిరోజూ చేపట్టిన పనులు ఏవిధంగా జరుగుతున్నాయన్న విషయాలపై కార్పొరేషన్ కార్యాలయం నుంచి తనతో పాటు ఏఈలు కిషోర్, ప్రవీణ్‌లు పర్యవేక్షిస్తారని అన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ ఏఈ ప్రవీణ్ గురువారం పరిశీలించారు. వడ్డేశ్వరం రాధా రంగా నగర్‌లో కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రవీణ్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని ఇంజినీరింగ్ సిబ్బంది నిరంతరం క్వాలిటీని పరిశీలించే విధంగా ఆదేశాలు జారీ చేశామని, పనులు జరుగుతున్నంత కాలం పనులను పర్యవేక్షిస్తారని, అభివృద్ధి పనుల్లో ఎటువంటి లోపాలు జరిగినా ఉపేక్షించమని ఆయన అన్నారు.

ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుంది



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యాన నిర్వహించిన బాలోత్సవ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం అధ్యక్షులు వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని అన్నారు. పాఠశాల పుస్తకాలతోపాటు సమాజంలో జరుగుతున్న మార్పులను కూడా ఎప్పటికప్పుడు విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. బాలోత్సవంలో చిన్నారులు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయి తదితర వేషధారణలు, కూచిపూడి నృత్యాలు, జానపద కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్త తుమ్మల శ్రీకుమార్, సిఐటి అధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు, రాష్ట్ర బాలోత్సవ కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, ఆంధ్ర నాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంగళగిరి: నగరంలోని ఆర్అండ్ బీ బంగ్లా వద్ద ఆటో–పోలీస్ వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు... మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెనుమాకకు చెందిన షేక్ బాజీ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతి రోజూ మాదిరిగానే గురువారం ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని మంగళగిరి నుంచి విజయవాడ వైపు వెళుతున్నాడు. మార్గంమధ్యలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్దకు చేరుకునే క్రమంలో విజయవాడ వైపు నుంచి వస్తున్న పోలీస్ వాహనం ఢీ కొట్టడంతో ఆటో రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ బాజీతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న యర్రబాలెంకు చెందిన ఈశ్వరమ్మ, సాయిలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించారు.

రానున్న కాలంలో డ్రోన్‌లదే హవా

కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథివర్మ



డ్రోన్ ఆపరేటింగ్ చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: రానున్న కాలంలో డ్రోన్‌లదే హవా అని కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ అన్నారు. గురువారం కేఎల్‌యూలో గరుడ క్లబ్ ఆధ్వర్యాన డ్రోన్ వర్క్‌షాప్ ప్రారంభించారు. వర్మ మాట్లాడుతూ డ్రోన్‌ల నిర్మాణంలో కేఎల్‌యూ కీలక మైలురాయిని చేరుకుందని అన్నారు. తమ క్యాంపస్‌లో ఉన్న టెక్నాలజీ క్లబ్‌లు నిర్వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీలో ముందంజలో ఉన్నాయన్నారు. రానున్న కాలంలో కేఎల్‌యూ తరపున రద్దీగా ఉన్న రోడ్లపైన అధిక ట్రాఫిక్ సమాచారాన్ని ఇతర ప్రాంతాలకు అందించడమే కాకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేసే సామర్థ్యం కలిగిన డ్రోన్‌లను తమ విద్యార్థులు తయారు చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్ పితామహుడు మిలింద్ రాజ్ కేఎల్‌యూ విద్యార్థులను అభినందించారు. కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ నీలు సింగ్ మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 25 వరకు ఈ డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని, డ్రోన్‌ల ఆపరేషన్, నిర్వహణ గురించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్. వెంకటరామ్, డీన్ అకడమిక్ హరికిరణ్, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎ. సింథెల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి విక్రయిస్తున్న వారి అరెస్ట్ చూపుతున్న సీఐ శేషగిరిరావు తదితరులు

తాడేపల్లిరూరల్: గుండిమెడ శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. వారిని కోర్టుకు హాజరుపర్చారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు గురువారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. గుండిమెడకు చెందిన మల్లవరపు పృథ్వీ, గుండిమెడ తంబికుమార్‌లు అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు సీఐ శేషగిరిరావు ఎస్ఐ రమేష్‌తో కలసి దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టుకు హాజరుపర్చారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఎవరు అమ్ముతున్నా పోలీసులకు తెలియజేస్తే ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. దాడిలో సిబ్బంది కొండలరావు, కళ్యాణ్, శ్యామ్ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

మంగళగిరి: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నగర పరిధిలోని యర్రబాలెం బసవతారక నగర్ మస్జిద్ ఎ మొహమ్మద్ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా నివశించే 32 పేద ముస్లిం కుటుంబాలకు ఐదు కేజీల బియ్యం, కేజీ సేమియా, కేజీ కందిపప్పు, మూడు కిలోల గోధుమ పిండి, నూనె, కేజీ పంచదార, కిలో మినపగుళ్లు, చింతపండు, బొంబాయి రవ్వ, పెద్ద ఉల్లి పాయలు, పసుపు, కారం, సాల్ట్, ఎండు కొబ్బరి, ఖర్జూరాలను అందజేశారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ ప్రతినిధులు బాషా, అబ్దుల్లా, ఇస్మాయిల్ ఇమామ్ ఫయాజ్ ఆలం, మౌజన్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డులో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి విఘ్నేశ్వర పూజ, పంచామృత అభిషేకాలు నిర్వహిచారు. శాంతిహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం వంటి కార్యక్రమాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి శాంతి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీస్థాయిలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. వేడుకలలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రివేళల్లో భక్తుల కోసం మూడు సాంఘిక నాటకలు ఏర్పాటు చేశారు.

వలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

మేడికొండూరు: మండలంలోని రెండు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.శోభారాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. మేడికొండూరు–1, పేరేచర్ల–4లో రిజర్వేషన్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు పదో తరగతి, 18 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు ఈనెల 24న పరిశీలన చేస్తామన్నారు. మౌఖిక పరీక్ష ఈనెల 29వ తేదీన నిర్వహిస్తామన్నారు.

తపాలా జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలి

మంగళగిరి: గ్రామీణ తపాలా జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలని పోస్ట్‌మాస్టర్ నరసింహారెడ్డి కోరారు. గ్రామీణ తపాలా జీవిత బీమా దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎల్ఐ చేసేందుకు 18 నుంచి 55 సంవత్సరాలలోపు ఉన్న పౌరులు అర్హులని తెలిపారు. ఈ పథకంలో మిగిలిన ఇతర పథకాల కంటే అధిక బోనస్, తక్కువ ప్రీమియం ఉంటుందన్నారు. వీటన్నింటికీ 80 సీ కింద పన్ను రాయితీ ఉంటుందని, కావున ప్రజలు గ్రామీణ తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

78 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో నిర్వహించారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తమాలిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 35 మందికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించామని, ఐదుగురికి కంటి ఆపరేషన్ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని అన్నారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంగ్రెస్ పాదయాత్రలు

మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రలు కొనసాగుతున్నాయి. గురువారం నగర పరిధిలోని యర్రబాలెం, బేతపూడి, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు గ్రామాల్లో పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలీమ్, రేమిణిశెట్టి హనుమంతరావు, దేశబోయిన శ్రీనివాసరావు, షేక్ మున్నీ తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయం శిఖర ప్రతిష్టా మహోత్సవం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజలో కోదండ రామాలయం నూతన విమాన శిఖర ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. దాతలు సింహాద్రి వెంకటరామారెడ్డి, స్వాతి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాజ్యాధికార సాధన లక్ష్యంగా కార్యాచరణ

మంగళగిరి: రాజ్యాధికార సాధన లక్ష్యంగా దళిత, దళిత క్రైస్తవులు కార్యాచరణ రూపొందించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిటైర్డ్ డీఐజీ చావలి బాలస్వామి తెలిపారు. గురువారం నగర పరిధిలోని నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్‌లో సీఎస్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బాలస్వామి మాట్లాడుతూ దళితుల సమస్యలు సామాజిక సమస్యగానే కాకుండా అది రాజకీయ సమస్య కూడా అని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు పాస్టర్ సహదేవ్, న్యాయవాది రాయపూడి మణి, పచ్చిగళ్ల దేవానందరావు, మన్నే ఏసుదాసు, లార్డ్ వెస్లీ, బి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

